ధ్యానం చేసేవాడు, నా పని చేసేవాడు, నా కళ్యాణగుణాలను స్మరించుకొనేవాడు నన్ను పొందుతాడు అని పరమాత్మ చెపుతున్నాడు. మీరు అహింస, అహింస అంటున్నారు మరి మానవజాతిలో యుద్ధాలు తప్పవుకదా. యుద్ధాలన్నీ హింసకదా అది అహింస ఎలా అవుతుంది అని ఒకరు బుద్ధుడిని అడిగారు. బుద్ధుడు ఏమని చెప్పాడంటే ఆ యుద్ధం చేసేటప్పుడు కర్తృత్వం లేకుండా, ద్వేషం లేకుండా కనుక యుద్ధం చేస్తే అది అహింసలోనికే వస్తుందని చెప్పాడు. మీరు ఎవరితోటి ఎక్కువ స్నేహం చెయ్యవద్దు, వైరాలు కూడా పెట్టుకోవద్దు. మీరు అతిగా స్నేహం చేసినా, ఎక్కువ వైరం పెట్టుకున్నా మీ మనస్సు బాహ్యముఖానికి వస్తుంది. అది ఒక ఎటాచ్‌మెంటుకి దారి తీయవచ్చు, లేకపోతే మీరు పాపం చేయటానికి కూడా అవకాశాలు రావచ్చు. గాంధీగారు భగవద్గీత చదవటానికి సంస్కృతం నేర్చుకున్నారు. గాంధీగారు చిన్నప్పుడు తల్లి చనిపోయింది కాని అమ్మలేని లోటు నాకు ఎప్పుడూ కలుగలేదు. భగవద్గీత మా అమ్మలేని లోటులేకుండా తీర్చింది. నాకు అనేక సందేహాలు, అనుమానాలు వస్తూ ఉండేవి. నేను భగవద్గీత తీసి చూస్తే అందులో ఏదో ఒక శ్లోకం ద్వారా నా అనుమానాలు, సందేహాలు తీరిపోయేవి. నన్ను అనుమాన రహితుడిని చేసి నన్ను ఆయన స్వరూపంలో స్థిరపడేటట్టు చేసింది భగవద్గీత అన్నారు. గాంధీగారు అనేవారు మీరు ఇప్పుడు నన్ను మహాత్ముడు అని అనకండి. మరణకాలంలో కూడా నేను రాముడిని స్మరిస్తే అప్పుడు మహాత్ముడిని అని అన్నారు. ప్రతీ జీవుడికి కూడా మరణటైము పరీక్షటైము. మనం జీవితం పొడుగునా సాధన చేసినా మరణకాలంలో పరమాత్మని మరిచిపోతే సున్నా. మీకు భక్తి ఉంది కానీ అది సరిపోదు. మిగతా సంస్కారాల కంటే దైవభక్తి బలంగా ఉండాలి. దైవభక్తి బలంగా ఉంటేనే కాని ప్రాణం పోయే టైములో భగవంతుడు గుర్తుకు రాడు. ప్రాణంపోయే క్షణంలో ఏ తలంపు ఉందో ఆ తలంపును బట్టి నీకు పునర్జన్మ వస్తుంది.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-10-2011, అమలాపురం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

గాడ్ హేజ్ క్రియేటెడ్ సమ్ సోల్స్ టు లివ్ ఫర్ అదర్స్ ఓన్లీ. చాలామంది వారి కోసం వారే జీవిస్తూ ఉంటారు. భగవంతుని ప్రణాళికలో కొంతమంది మాత్రమే ఇతరులకోసం జీవిస్తూ ఉంటారు. అందరూ ప్రజలకు సేవచేయలేరు. కొద్దిమంది మాత్రమే చేయగలరు, అది భగవంతుడు ఇచ్చిన వరం. మనం చెయ్యాలి అంటే చెయ్యలేము. సమిష్టి పనులు

ఇష్టంగా, ప్రేమగా చేయటం వలన హృదయం యొక్క లోతులు పెరుగుతాయి. జపం చేయటం వలన, ధ్యానం చేయటం వలన ఏ ఫలితాన్ని పొందుతారో కోరికలేని కర్మ చేయటం వలన, కర్తలేని కర్మ చేయటం వలన అదే ఫలితాన్ని పొందుతారు. సత్కర్మకూడా నిష్కామంగా చేయమని గీతలో పరమాత్మ చెప్పాడు. సైన్సుపేరు మీద, టెక్నాలజీ పేరుమీద మనం సాంప్రదాయాన్ని విడిచిపెట్టకూడదు. సైన్సు, టెక్నాలజీ ఇవి అన్నీ బాహ్యమైన గొడవలు, ఇవి మనస్సును విశాలం చెయ్యలేవు.

మనకు అవుటర్ గవర్నమెంట్ ఉంది. అవుటర్ గవర్నమెంట్ అంటే మనలను పరిపాలించే మంత్రులు, అధికారులు. వీరు మన బాహ్య అవసరాలను చూస్తారు. మనలోపల ఒక ఇన్నర్ గవర్నమెంట్ ఉంది. దాని గురించి చాలామందికి తెలియదు, తెలుసుకోవాలనే కాంక్ష కూడా లేదు. మన శరీరం ఎక్కడ పుట్టాలి, ఏవృత్తిలో ఉండాలి, మరల ఎప్పుడు చనిపోవాలి ఇవి అన్నీ నిర్ణయించేది ఇన్నర్ గవర్నమెంట్. ఇది అంతా భగవంతుడి ప్రణాళికను బట్టి నడుస్తూ ఉంటుంది. మీ జీవతంలో ఏ సంఘటన జరిగినా అది భగవంతుడికి తెలియకుండా రాదు. మనకు ఐశ్వర్యం వచ్చినా, పేదరికం వచ్చినా, మన కుటుంబాలలో ఎన్ని కష్టాలు వచ్చినప్పటికీ మనకు పాఠాలు నేర్పటానికే భగవంతుడు అలా ఏర్పాటు చేసాడు అంతేగాని మన మీద ఆయనకు విరోధంలేదు. అందుచేత మనలో ఒక గవర్నమెంట్ ఉందనీ, మనలను పాలించేవాడు మనలోనే ఉన్నాడని మనం మరిచిపోకూడదు.

మీరు దేనిని చూసి గర్వపడవద్దు. మనకు ధనం ఉంటే, కీర్తిఉంటే, అధికారం ఉంటే మనలో ఏదో విశేషం ఉందని అని మనం అనుకొంటాము. మన దేహంతోటి, మనస్సుతోటి, ఈ ప్రపంచంతోటి సంబంధంలేకుండా మనలో ఒక సద్వస్తువు ఉంది. అది మనకు అనుభవంలోనికి వచ్చినప్పడు మనకు ఉన్న సంపద, అధికారం ఇవి అన్నీ గడ్డిపరకతో సమానం కింద మనకు కనిపిస్తాయి. దేవుడు ఉన్నాడా లేడా అనేది సమస్యకాదు. మనలోపల ఉన్న సద్వస్తువు తాలూక అనుభవం సంపాదిస్తే ఇంక తిరిగి ఈ భూమి మీదకు రానక్కరలేదు. అక్కడికి మేల్కొలపటానికే ఈ సమావేశాలు. ధనంవలన జ్ఞానం రాదు, ధనం వలన భోగం వస్తుంది. భోగాల తరువాత రోగాలు వస్తాయి. కొంతమంది ధనం ఉన్నా నిగ్రహించుకొంటారు, అందరికీ ఆ నిగ్రహం ఉండదు. కొంతమందికి పాండిత్యం ఉన్నా, పాండిత్యం లేనట్లే కనిపిస్తారు. ఎందుచేతనంటే వారికి సబ్జక్టు ప్రధానం, ఆలోచన ప్రధానం, కాని ప్రదర్శన వారికి అక్కరలేదు.

మీరు ప్రదర్శనలోనికి వెళితే వ్యక్తి భావన పెరిగిపోతుంది.

మనం నేను, నేను అంటాము. ఈ నేను అనేది ఒక తలంపు. జీవితంలో నేను అది సాధించాను, నేను ఇది సాధించాను అంటాము. ఈ నేను అనే తలంపును పట్టుకొని రాగద్వేషములు, చావుపుట్టుకలు తిరుగుతూ ఉంటాయి. శరీరం చనిపోయేటప్పుడు నేను చనిపోతున్నాను అనుకొంటాడు. ఎవరు చనిపోతున్నారు? దేహం చనిపోతుంది. ఆ దేహంతో తాదాత్మ్యం పొందే నేను నిజమైన నేను కాదు. నిజమైన నేను మటుకు బాడీలెస్, మైండ్‌లెస్, గాడ్‌లెస్ ఆల్‌సో. మనం నేను, నేను అనేది ఒక తలంపు. నేను అనే తలంపు వచ్చాక ప్రపంచం వచ్చింది, దేవుడు వచ్చాడు, పుణ్యపాపములు వచ్చాయి, జన్మలు వచ్చాయి. ఆ నేను అనే తలంపును మనం దాటాలి. ధనంకోసం, పదవులకోసం ఇలా చాలామంది భగవంతుడిని ప్రార్థిస్తూ ఉంటారు. అది పొరపాటు అని నేను చెప్పటంలేదు. కాని ఈ దేహగతమైన నేనులోనుండి విడుదల చేయమని ఎవరూ భగవంతుడిని ప్రార్థించటంలేదు. ఎందుచేతనంటే దాని విలువ వారికి తెలియదు.

మీరు అందరూ సుఖంగా శాంతిగా ఉన్నారా అంటే లేరు. ప్రతీ సంసారంలోకూడా ఏవో సమస్యలు. మీరు బాగున్నారా అంటే బాగానే ఉన్నాము అని చెపుతారు కాని అవన్నీ అబద్ధాలు. పుణ్యాలు చేసుకొని మంచి లోకాలకు వెళదామని చాలా మంది అనుకొంటారు, అలా అనుకోవటం మంచిదే. ఎప్పుడైతే గోయింగ్ ఉందో అప్పుడు కమింగ్ తప్పదు. ఎప్పుడైతే మనిషి పుట్టాడో వాడు చనిపోవటం తప్పదు. ఈ మర్మం అంతా మనస్సులో ఉంది. మనం చాలా విషయాలు నేర్చుకొంటున్నాము కాని మన గురించి మనం నేర్చుకోవటంలేదు. ఇతరులు ఎలా ఉన్నారు అని మనం అనుకొంటున్నాము కాని మన మనస్సు ఎలా ఉంది, మన మనస్సును పవిత్రం చేసుకొంటున్నామా లేదా అనే ఆలోచన మనకు లేదు. మనం ఏదైనా సత్కర్మ చేసినా అది ప్రచారం కోసం చేయకూడదు, భగవంతుడు సంతోషించటం కోసం చేయాలి. సత్కర్మ నిష్కామంగా చేస్తే మనస్సు బాగుపడుతుంది, ఇంద్రియాలు నిర్మలమవుతాయి.

మన శరీరం, మనస్సు సహకరించకుండా మనం ఏదీ సాధించలేము. అందుచేత శారీరకఆరోగ్యం, మానసికఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకోవాలి. మితభాషణం. అంటే మనం ఎవరితోనైనా మాట్లాడేటప్పుడు ఎంతవరకు అవసరమో అంతవరకూ మాట్లాడాలి, అతిగా

మాట్లాడకూడదు, చెప్పవలసిన మాటలు విడిచిపెట్టకూడదు, చెప్పకూడని మాటలు చెప్పకూడదు, హితవుగా మాట్లాడాలి, వారి శ్రేయస్సుకోరి మాట్లాడాలి. మితఆహారం. మనదేహం సాధనకు ఉపయోగపడేలా మనం ఆహారం తీసుకోవాలి. ఎక్కువగా తింటే బద్ధకం వస్తుంది, తక్కువగా తింటే నీరసం వస్తుంది, సరిపడగా సమానంగా తినాలి. ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉంటే, దేహఆరోగ్యం బాగా చూసుకొంటే ప్రకృతిలో ఉన్న ప్రలోభాలకు లోనుకాము.

మనకు ఉన్న అవిద్యవలన, అజ్ఞానంవలన, మనలో ఉన్న బలహీనతల వలన ప్రపంచంలో ఏదో ఉంది, ఏదో ఉంది అనిపిస్తుంది. బయట ఏమీ లేదు, ఉన్నదేదో నీ హృదయంలోనే ఉంది. మనకు ఉన్న అలవాట్లలోనుండి, బలహీనతలలోనుండి బయటకు వస్తే ఈ ప్రపంచంలో ఏమీసారం లేదు అని అప్పడు నీకు తెలుస్తుంది. మనకు నిద్రలో స్వప్నం వస్తుంది. స్వప్నంలో అనేక సంఘటనలు జరుగుతూ ఉంటాయి. జాగ్రదవస్థ లోనికి రాగానే అది అంతా అబద్ధం అని మనకు తెలుస్తుంది. స్వప్నానికి సంబంధించిన ఎక్స్‌టెన్షనే జాగ్రదవస్థ అని మిల్టన్ చెప్పాడు. స్వప్నం పొట్టిగా ఉంటుంది, జాగ్రదవస్థ పొడుగుగా ఉంటుంది అంతే తేడాగాని అదెంత అసత్యమో ఇదికూడా అంతే అసత్యం అని చెప్పాడు. మీరు ఈ శరీరంలో ఉండగానే, ఈ లోకంలో ఉండగానే మీ హృదయంలో ఉన్న సద్వస్తువు మీకు అనుభవంలోనికి రావాలి. అప్పడు బాహ్యసంఘటనల ప్రభావం మీమీద పడదు. బాహ్యపరిస్థితులు మీకు అనుకూలంగా ఉంటే సంతోషంరాదు, బాహ్యపరిస్థితులు వ్యతిరేకంగా ఉంటే మీకు దుఃఖంరాదు. బాహ్యపరిస్థితులు మీకు వ్యతిరేకంగా ఉన్నా, అనుకూలంగా ఉన్నా ఇది అంతా స్వప్నమే అని మీకు తెలుస్తుంది. మనకు నిద్రలో స్వప్నాలు వస్తాయి, అజ్ఞానంలో జన్మలు వస్తున్నాయి.

నీవు ఎవరో నువ్వు తెలుసుకోవటానికి ఈ భూమిమీదకు వచ్చావు. మనకు నేను అనే తలంపు జాగ్రదవస్థలో ఉంటుంది, గాఢనిద్రలో అది అణిగిపోతుంది, అది అణిగిపోయి నప్పడు మనకు దేహం గొడవలేదు, ప్రపంచం గొడవ లేదు, ఏగొడవ లేదు. జాగ్రదవస్థలోనికి రాగానే మొదట మనకు నేను అనే తలంపు వస్తుంది, ఆ తలంపు వచ్చాక ఇతర తలంపులు వస్తాయి. ఈ తలంపులు మీరు కాదు, రాగద్వేషాలు మీరు కాదు, చావుపుట్టుకలు మీరు కాదు. ఇవన్నీ మీరు కాదు, మీకు వస్తున్నాయి. ఇక్కడ సబ్జక్టు బాగా అర్థం చేసుకోండి.

సబ్జక్టు మీకు అర్ధమయితే దానిమీద శ్రద్ధ కలుగుతుంది. శ్రద్ధలేకుండా జ్ఞానం కలుగదు. జ్ఞానానికి మించిన సంపద గాని, జ్ఞానానికి మించిన సౌందర్యంకాని, జ్ఞానానికి మించిన భాగ్యం కాని ఈ సృష్టిలో ఏమీ లేదు. మనం పైపై ఉన్న గొడవలకు ప్రాముఖ్యత ఇస్తున్నాము కాని హృదయంలోనికి వెళ్లాలి అనే గొడవ ఎవరికీ లేదు. స్వర్గరాజ్యం నీ హృదయంలోనే ఉంది. నీకు లోపలచూపు కలుగటంలేదు. నీహృదయంలో ఉన్న శాంతిని, ఆనందాన్ని వదిలేసి రోడ్డుమీద ఉన్న పెంకుముక్కలకోసం తిరుగుతున్నావు. బాహ్యవిషయాలలో మోహంపెట్టుకొని ఎంతదూరం అయితే బయటకు పోయామో మరల అంత వెనక్కి వస్తేకాని మీ మనస్సు దాని గూటిలో పడదు. సహవాసాల విషయంలో మనం చాలా జాగ్రత్తగా ఉండాలి. మనకు ఏకాంతవాసం కూడా కొంత అవసరం.

ఉన్నాను. ఆ ఉన్నదానిని మనం గుర్తించాలి. అది ఎలా ఉందో అలా మనం ఉండగలగాలి. ఆ ఉన్నదానికి చావులేదు, పుట్టుకలేదు, దానికి ప్రపంచంలేదు, దేవతలు లేరు కాని దానిలో శాంతి ఉంది, సుఖంఉంది, ఆనందం ఉంది. ఉన్నదానిని ఉన్నట్లుగా నువ్వు గ్రహించగలిగితే ఇప్పడే ఇక్కడే శాంతిలో, సుఖంలో, ఆనందంలో ఊగిసలాడతావు. కొంతమంది వారికి ఉన్న పాండిత్యమే ఆత్మజ్ఞానం అనుకొంటారు. అది చాలా ప్రమాదం. పాండిత్యం అంటే అది మనస్సుతో సంపాదించినది. మనస్సు అణగిపోయినప్పడు ఇవి అన్నీ అణిగిపోతాయి. ఇవి అన్నీ కూడా చమత్కారాలే. ఉన్నాను అనే దానితో పోల్చుకుంటే మనం ఎంత? మన జీవితం ఎంత? శరీరం చనిపోయేటప్పడు నేను చనిపోతున్నాను అని మనం అనుకుంటాము. ఇలా అనుకొనే వాడికి జన్మరాహిత్యం రాదు. శరీరం చనిపోతున్నా అది ఎలా వచ్చిందో అలా పోతుంది అని ఆ శరీరంతో అనుబంధం లేకుండా నేను ఉన్నాను అని, ఆ ఉండటం అనేది నీకు అనుభవంలోనికి వస్తే అప్పడు నీకు జన్మరాహిత్యం వస్తుంది. ఆ ఉన్నదేదో మనం తెలుసుకోవాలంటే అది మనకు తెలియబడదు, అది ఎవరికైతే తెలియబడాలి అని అనుకొందో వారికి మాత్రమే అది తెలియబడుతుంది. ఎందుచేతనంటే మన ఇన్నర్‌లైఫ్ దానికి తెలుసు అంటే నువ్వు లోపల ఎలా ఉన్నావో దానికి తెలుసు. మన కోరిక వలన ఏమీ రాదు. మనకు ఎంతవరకుఅర్హత ఉందో, యోగ్యత ఉందో అంతవరకు మనకు వస్తుంది కాని ఏదో కోరిక ఉందని వచ్చి మీద పడిపోదు. అందుచేత ఏవో బాహ్యపరిస్థితులు బాగున్నాయి అని అహంకారం పెంచుకోవద్దు. ఇలా అహంకారం పెంచుకొని చనిపోతారు అనుకోండి రాబోయే జన్మలలో మరల అంత వెనక్కి వస్తేనేగాని మీకు సాధన

ప్రారంభమవ్వదు. అందుచేత గురువు అవసరం. మిమ్మల్ని కరెక్టుగా గైడ్ చేసే వాడే గురువు. మీలో ఉన్న చీకటిని పోగొట్టి మీకు శాంతి ప్రసాదించేవాడే గురువు.

నువ్వు పొందిన శరణాగతి నిజమైతే, నీకు ఉన్న భక్తి నిజమైతే, నీకు ఉన్న జిజ్ఞాస నిజమైతే భగవంతుడు నీకు ఏది అనుగ్రహిస్తే దానితో సంతోషిస్తావు కాని నాకు ఇది కావాలి, అది కావాలి అని అడగవు. నిజమైన నేను ఏమి అడుగదు, దేహగతమైన నేనే ఇవి అన్నీ అడుగుతుంది. ఇలా ఏదో ఒకటి అడిగే కొలదీ నీ స్వరూపానికి నువ్వు దూరమవుతావు. కళ్ళకు కనిపిస్తున్న ఈ ప్రపంచం అంతా స్వప్నం అని మీకు తెలియాలి అంటే మీకు స్వరూప జ్ఞానం రావాలి. స్వరూపజ్ఞానం రాకుండా ఈ ప్రపంచం అంతా స్వప్నం అని నువ్వు ఎన్నిసార్లు గ్రంథాలలో చదివినా ప్రయోజనం లేదు. గ్రంథాలు చదవటం వలన పాండిత్యం వస్తుంది కాని ఆత్మజ్ఞానం రాదు. భగవంతుడు నీకు ఏది ప్రసాదిస్తే అది తీసుకో, ఆయన ఎక్కడ కూర్చోబెడితే అక్కడ కూర్చో. నీకు ప్రత్యేకంగా కోరికలు వద్దు. నీకు ఎప్పుడు, ఎక్కడ, ఏది అవసరమో అంతా ఆయనే చూసుకుంటాడు. కోరికకు శక్తిలేదు, శక్తి అంతా ఈశ్వరుడిదే. ఆయన ప్రణాళిక ప్రకారం ఈ సృష్టి అంతా నడుస్తోంది. మీకు తెలుసున్నా అంతే, తెలియకపోయినా అంతే. ఈ వాక్యం అర్థమైతే మీలో ఉన్న అశాంతి అంతా ఆరిపోతుంది. మనం చెప్పకొనే దానిలో అరువు బేరాలులేవు, అంతా కేష్ బేరమే. మీరు ఇక్కడ పుణ్యం చేసుకోండి. ఇంకో లోకానికి వెళ్ళి ఆ పుణ్యం అనుభవించవచ్చు, అటువంటి అరువు బేరాలు యిక్కడ లేవు. నువ్వు ఇంకో లోకానికి వెళతావు అక్కడ ఎంతకాలం ఉంటావు. మేము మారని చెక్కులు ఇవ్వము. మీకు ఏదో చెక్కు ఇచ్చి అది మీరు చనిపోయిన తరువాత మారుతుంది అంటే ఆ మాటకు అర్ధం ఏమిటి? శరీరానికి అనారోగ్యం వస్తే భరించగలము కాని మనస్సుకి అశాంతి వస్తే భరించలేము.

సత్యాన్ని తెలుసుకోవటానికి శరణాగతి మార్గం, విచారణామార్గం రెండు మార్గాలు చెప్పారు. భగవంతుడి సంకల్పమే నా సంకల్పం, ఆయన ఇష్టమే నా ఇష్టం, నాకు ప్రత్యేకంగా ఇష్టాలు అంటూ లేవు, సంకల్పాలు అంటూలేవు అనుకొనేవాడు శరణాగతికి పనికివస్తాడు. శరణాగతి అందరూ చెయ్యలేరు. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అంటే కొంతమంది నూటికి నూరుపాళ్ళు నమ్ముతారు. ఆ నమ్మకం లేని వారికి, విశ్వాసం లేనివారికి నేను ఎవడను అను విచారణ మంచిది. మనం నేను, నేను అంటున్నాము. ఆ నేను అనేది ఒక

తలంపు. ఆ నేను అనే తలంపును దాని మూలంలోనికి పంపగలిగితే, అది నెమ్మదిగా సన్నగిల్లి నశిస్తుంది. అక్కడ ఉన్న సత్యం నీకు ఎరుకపడుతుంది. ఇప్పుడు మనం నేను, నేను అంటున్నాము కదా ఆ నేను నేను కాదని మీకు అర్థమవ్వాలి. జ్ఞానం అంటే ఏమిటి అని ఒకసారి రామకృష్ణుడిని అడిగారు. నేను అనే తలంపు అందరికి ఉంది. దేవుడు లేడని చెప్పేవారు ఉన్నారు కాని నేను లేనని ఎవరూ చెప్పరు. నువ్వు నేను, నేను అంటున్నావు. ఆ నేను నిజంకాదు కాని అది నిజం అని నువ్వు అనుకొంటున్నావు. ఆ నేను నేను కాదని తెలుసుకోవటమే జ్ఞానం అని చెప్పారు.

ఉదయం లేచినది మొదలు రాత్రి నిద్రపోయేవరకు దేహగతమైన నేనును ముస్తాబు చేయటం తప్ప మనకు ఇంకోపనిలేదు. మనం ఏదైతే కాదో దానిని ముస్తాబు చేయటమే మనకు సరిపోతోంది. మీరు ఎంతసేపు ఈ దొంగ నేనును అలంకరించటానికి చూస్తున్నారు కాని, దానిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయటంలేదు. మీరు ఏదైనా ఒక మంచి పనిచేసినా, మంచిమాట మాట్లాడినా, ఎవరికైనా ఉపకారం చేసినా గౌరవాలకోసం, వారు ఏదో మెచ్చుకొంటారు అని చేస్తున్నాము అంటే వాటిని దండలుగా మార్చుకొని, బంగారపు వస్తువులుగా మార్చుకొని ఈ దొంగనేనును అలంకరించుకోవటమే మనం చేసేపని, ఇంకోపని ఏదైనా మనకు ఉందేమో మీరు ఆలోచించుకోండి. మీరు బాగా సంపాదించారా అని ఎవరితోనైనా అనండి, వెంటనే వాడు సంతోషిస్తాడు, అంటే ఆ మాటను వాడి అహంకారానికి దండకింద వేస్తున్నాడు. నిజంగా వాడు సంపాదించాడా, లేదు, ఈశ్వరుడు ఇస్తే వచ్చింది. మనం సంపాదించాలి అంటే సంపాదించగలమా? అందరికీ సంపాదించాలి అని ఉంది సంపాదించుకోగలుగుతున్నారా, లేదు. ఐశ్వర్యం అంతే ఈశ్వరుడిదే, నీకు కోటాకు ఎంత ఇవ్వాలో ఆయన ఇస్తాడు.

మనం మనుషులను అనవసరమైన మాటలు చెప్పి పాడుచేయకూడదు. మీరే రాముడు, శ్రీరాముడే ఈ రూపం ధరించి వచ్చాడు అని మనం ఎవరితోనైనా అంటే పాపం అదే నిజం అని వారు అనుకొంటారు. శాస్త్రిగారికి ఆరోగ్యం బాగా లేనప్పుడు గాంధీగారు ఆయనను చూడటానికి హాస్పటల్‌కు వచ్చారు. ఆయనను చూసి శాస్త్రిగారికి ఎమోషన్ వచ్చి ఈ రోజున నన్ను సాక్షాత్తూ శ్రీరాముడే చూడటానికి వచ్చాడు అన్నాడు. అప్పుడు గాంధీగారు సంతోషించలేదు. శాస్త్రిగారు మీరు తప్పగా మాట్లాడుతున్నారు. రాముడెక్కడ,

నేను ఎక్కడ, రాముడు అంటే అంతర్యామి, ఆయన ఈ సృష్టికి యజమాని అని చెప్పారు. మీరే రాముడు అని మనలను ఎవరైనా అంటే అదే నిజం అనుకొంటాము దానికి కారణం మనలో ఉన్న మైనస్‌పాయింట్స్ ఏమిటో మనకు తెలియకపోవటం వలన అలా అనుకొంటాము. నీ అహంభావనలో ఏదో గొప్పతనం ఉందని ఇప్పుడు నువ్వు అనుకొంటున్నావు. ఈశ్వరుడిని ప్రార్థించగా ప్రార్థించగా, ఆయన గురించి శ్రవణం చేయగా చేయగా ఈ అహంభావన ఎందుకు పనికిరానిది అని అప్పుడు నీకు తెలుస్తుంది. లోపల సుఖం లేనప్పుడు, లోపల ఆనందం లేనప్పుడు నీ అంత గ్రేట్‌మేన్ ఈ అమలాపురంలో ఎవడూ లేడు అని చెప్పకోవటం వలన నీకేమి వస్తుంది. మానవుడు సాధనచేసి కామక్రోధములను దాటవచ్చు కాని వాడు ఎంత సాధన చేసినా ఈశ్వరుని అనుగ్రహం లేకపోతే కీర్తికాంక్షలో నుండి బయటకు రావటం కష్టం. నువ్వుకాని నేనుతో తాదాత్మ్యం పొందుతున్నంతకాలం నువ్వు కీర్తిని కూడా కోరుకొంటావు. రూపబుద్ధిలో నుండి నామబుద్ధిలోనుండి విడుదలపొందకపోతే సత్యం నీకు ఎరుకపడదు.

నువ్వు శరణాగతి మార్గాన్ని అనుసరించు, విచారణామార్గాన్ని అనుసరించు, ఏమార్గాన్ని అనుసరించినా అంకితభావంతో ప్రయాణం చెయ్యి, ఆ మార్గం పట్ల నీకు ఇష్టం ఉండాలి, దానిపట్ల సందేహం ఉండకూడదు, ఆ మార్గం నన్ను ఒడ్డుకు చేరుస్తుంది అనే విశ్వాసం ఉండాలి. మేము శరణాగతి చేస్తున్నాము కాని భగవంతుడి దగ్గరనుండి మాకు సహాయం అందటంలేదు అంటే నువ్వు శరణాగతి చేయటం లేదు అని అర్థం. నువ్వు నిజంగా శరణాగతి చేస్తే ఇటువంటి మాటలు రావు. దేశకాలాలు మనస్సులో ఉన్నాయి. మనస్సును దాటితే టైములేదు, సృష్టిలేదు. మనం సత్యానుభవం పొందాలంటే ఈ ప్రకృతిని దాటి వెళ్ళాలి, ఇంకో మార్గాంతరం లేదు. జిమ్మిక్కుల వలన, చిట్కాల వలన ఆత్మజ్ఞానం కలుగదు. ఇప్పుడు మీకు దేహంతోటి, మనస్సుతోటి తాదాత్మ్యం ఎలా ఉందో అలాగ సత్యంతో తాదాత్మ్యం వచ్చేవరకు సైతాను మిమ్మల్ని విడిచిపెట్టదు, సందేహాలు మిమ్మల్ని విడిచిపెట్టవు. ఒకవేళ విశ్వాసం ఎప్పుడైనా శనివారం కలిగినా అది ఆదివారం పోతుంది. మీరే సత్యం అయినప్పుడు ఇంక సందేహాలు ఏల? అయితే దానిని తెలుసుకొనే ప్రయత్నంలో మటుకు సందేహాలు వస్తాయి. ఒకోసారి విశ్వాసం కూడా పోగొట్టుకొంటాము. మీకు ఉన్న విశ్వాసం నిలబడాలి అంటే దానికి సజ్జనసాంగత్యం అవసరం. నీ దేహంలో నుండి, మనస్సులోనుండి,

ఈ జన్మ పరంపరలో నుండి నీకు స్వేచ్ఛ కావాలి అంటే నీ హృదయంలో ఉన్న సత్యాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవాలి. నీకు తెలుసున్న, తెలియకపోయినా అది ఎలా ఉందో అలాగే ఉంది. నీకు నమ్మకం లేనంతమాత్రంచేత ఉన్నది లేకుండా పోదు. అయితే నీ నమ్మకం దానిని తెలుసుకోవటానికి సహకరిస్తుంది. అందుకే నీకు విశ్వాసం అవసరం. శాస్త్రం ఎలా చెప్పితే అలా నడుచుకో అంతే కాని నేను చెప్పినట్లుగా శాస్త్రం ఉండాలని అనుకోవద్దు. శాస్త్రాన్ని అనుసరించి కనుక మనం జీవిస్తే మనస్సు అణిగిపోతుంది, యింద్రియాలు అణిగిపోతాయి. ఇంద్రియాలు, మనస్సు నూటికినూరుపాళ్ళు సత్యాన్వేషణకు సహకరిస్తాయి.

నీకు ఏది మంచిదో నీకంటే భగవంతుడికి బాగా తెలుసు. అందుచేత భారం అంతా ఆయన మీద వెయ్యి. ఒకడు రైలులో ప్రయాణం చేస్తున్నాడు. వాడికూడా ఒక పెట్టె ఉంది. వాడికి ఒక ఆలోచన వచ్చింది. ఈ రైలు నన్నూ మోస్తోంది, పెట్టెను మోస్తోంది, రైలుకు బరువు అవుతుందని ఆ పెట్టెను వాడి నెత్తిమీద పెట్టుకొన్నాడు. పెట్టెను నెత్తిమీద పెట్టుకొన్నా ఆ బరువును కూడా రైలే మోస్తోంది అని వాడికి తెలియదు. అలాగే మీరు కర్తృత్వం పెట్టుకొన్నా జరిగేది అంతే, కర్తృత్వం పెట్టుకోకపోయినా జరిగేది అంతే. నెత్తి మీద పెట్టుకోవటం వలన వాడు బాధ ఎలా అనుభవిస్తున్నాడో మీరు కర్తృత్వం పెట్టుకోవటం వలన అలా అనవసరమైన బాధలు, ఇబ్బందులు పడవలసి వస్తుంది. రైలులో ప్రయాణంచేసి పెట్టె వాడి నెత్తిమీద పెట్టుకొన్నవాడు ఎంత అమాయకుడు అని మనం అనుకొంటున్నామో మనంకూడా అంతే అమాయకులం, మనం కూడా అంతే అజ్ఞానులం. ఎందుచేతనంటే నువ్వు కర్తృత్వం పెట్టుకోవటం వలన అదనంగా ఏమీ జరిగిపోదు, కర్తృత్వం లేకపోయినంత మాత్రంచేత జరిగేది జరుగకమానదు. జరిగేది అంతా ఈశ్వరసంకల్పం. ఇది ఇలా జరిగిందేమిటి అని ప్రశ్నలు వేసుకోవద్దు. అలా జరగాలి అని ఇన్నర్ గవర్నమెంటు నిర్ణయించింది కాబట్టి అలా జరిగింది అంతే. శరణాగతి నేర్చుకోండి. ఒకేసారి పూర్ణశరణాగతి రాదు, నెమ్మదిగా ప్రాక్టీసు చెయ్యండి. నీ దేహప్రారబ్దంలో ఉన్న పనిని ఇష్టంలేకుండా చేసే బదులు, ఇష్టంతో చేస్తూ ఉంటే నీకు చిత్తశుద్ధి కలుగుతుంది, యింద్రియనిగ్రహం వస్తుంది, నీకు సత్యానుభవం కలుగుతుంది. మీరు హృదయంలో ప్రవేశించటానికి, హృదయంలో నిలబడటానికి మేము చేస్తున్న ప్రయత్నమే ఈ ప్రవచనాలు. మీరు అందరూ శాంతిసామ్రాజ్యానికి, సుఖసామ్రాజ్యానికి, ఆనందసామ్రాజ్యానికి అధిపతులు అవ్వాలని కోరుకుంటున్నాము.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| డిసెంబరు | 19 | భీమవరం, శివ కళ్యాణ మండపం |
| డిసెంబరు | 30 | ఏలూరు, శివరావు పేట, వెంకటేశ్వరస్వామి గుడి, సా॥ 6 గంటలకు |
| జనవరి | 1 | పాలకొల్లు, క్షత్రియ కళ్యాణ మండపం |
| జనవరి | 9 | జిన్నూరు, శ్రీ రమణ క్షేత్రం, రమణ జయంతి |

## "హితోపదేశము"

ఆదిశంకరుల "తత్వబోధ", "వివేక చూడామణి" అన్న ప్రకరణ గ్రంథాలకి సద్గురు శ్రీ నాన్నగారి వివరణ. "శంకరులంటే నాకు చాలా ఇష్టం. ఎందుకంటే వారికి బ్రహ్మానుభవం ఉంది. శాస్త్రజ్ఞానం ఉంది. అది ఇతరులకు చెప్పగల పాండిత్యం ఉంది. బ్రహ్మానుభవం, శాస్త్రజ్ఞానం, పాండిత్యం ఈ మూడు ఉన్న జ్ఞానులు అరుదు" అంటారు. నాన్నగారు తమ వివరణలో ఇంతేకాదు "బ్రహ్మమును చెప్పేవారు బ్రహ్మమై ఉండాలి" అని కూడా చెప్పారు.

ఈ పుస్తకం చదువుతుంటే నాకు తోచినది : బ్రహ్మానుభవం. శాస్త్రజ్ఞానం, పాండిత్యం - ఈ మూడు అంతర్లీనంగా ఉండి, నాన్నగారిలో ప్రముఖంగా, ప్రస్ఫుటంగా కనిపించే మరొక అంశం ఉంది, అదే వారి ప్రేమ. అలవోకగా ఆకట్టుకునే ఆ ప్రేమ వారి వివరణలో పడుగూ, పేకలా కలిసిపోయింది. "జ్ఞానియే నిజంగా ప్రేమించగలడు. అతడే నీకు హితుడు". ఇదే నాన్నగారి వ్యక్తిత్వంలో మనల్ని ఆకర్షించి, మనకి తెలియకుండానే ప్రభావితం చేస్తుంది. జ్ఞాని ఏది చెప్పినా "ప్రేమతోనే చెపుతారు. ఆ ప్రేమ నీకు దారి చూపుతుంది" అంటారు వారు.

"హితోపదేశం" శంకరుల తత్వబోధకి సమకాలీన స్థితులకి సామరస్యం చూపిస్తుంది. ఆ మార్గం "పాక్షిక సత్యాలనుంచి పారమార్థిక" సత్యాల వైపు నడుపుతుంది. ఈ కారణంగానే ఈ పుస్తకంలో ప్రతీ అధ్యాయం మొదట ఒక ప్రశ్న - సమాధానం - చివరిగా సూత్రప్రాయంగా "మననం చేయదగిన అంశాలు" ఉన్నాయి. అంటే శంకరుల పరిప్రశ్న, భాష్యం, సూత్రరూపంలో మననం అన్న నమూనా సహజంగా, సరళంగా ఇమిడాయి ఈ పుస్తకంలో.

నాన్నగారిది సమగ్ర దృక్పథం. అందుకే జ్ఞానమార్గంలో ప్రమాదాలని తేటతెల్లంగా వెల్లడించారు. ఇదంతా మాయ అని కొట్టిపారేయటం కుదరదు. నిజానికి లౌకిక ప్రపంచంలో మనం నిత్యం చూసే అంశాల నుంచే నాన్నగారు వేదాంత సూక్ష్మాలని రాబడతారు. పైగా ఆ చెప్పటంలో భాష సొగసు, భావగాంభీర్యం చకితుణ్ణి చేస్తాయి. సాధన అంటే? "సంపాదించ వలసింది లేదు. ఉన్నది ఊడగొట్టుకొనటమే" కావలసింది మరి అడ్డువచ్చేది? మాయ మాయంటే "ఉన్నది లేన్నట్టుగా లేనిది ఉన్నట్టుగా కనిపింపచేసే" మనస్సే మాయ.

నాన్నగారి "హితోపదేశం" వారు చెప్పినవి ఆచరించాలన్న తపన, వ్యాకులత కలిగించే అపూర్వ వివరణ. ఇవి పరాకాష్టకి చేరితే కలిగే "ఆనందం భరించగలమా?" అని అడుగుతారు నాన్నగారు. అందువల్ల ఇది ప్రేమజ్ఞానయోగ కరదీపిక. అధ్యయనమే ఆనందం కలిగించే రస గుళిక. ఈ సందర్భంగా ఒక విన్నపం "భగవద్గీతలో కొన్ని శ్లోకాలు వివరణ ద్వారా గీతాసారం కూడా రసంలో మించి, వశంలో ఉంచే వారి పద్ధతిలోనే చెపితే" మనందరికి మరొక వరం.

**- మ. శివరామకృష్ణ, హైదరాబాద్**

# విశ్వ ప్రేమకు బాహ్యరూపం అహింస

ప్రేమలేని బ్రతుకు ఎడారి వంటిది. మనం మనుషులమేకాదు పశుపక్ష్యాదులను కూడా ప్రేమించాలి. పిల్లల్లో ఇది పొంగి పొరలుతుంది. మొదలు అనేది ఉన్నప్పడు తుది అనేది ఉంటుంది. ప్రకృతి ప్రేమకు దుఃఖం తప్పదు. మనం ప్రేమించే జీవి మరణిస్తే దుఃఖం తప్పదు. కాని నాశనం లేని ప్రేమను అలవర్చుకోవాలి. అనంతుడైన భగవంతుని (గురుదేవులను) ప్రేమించాలి. ఆయన ఒక్కరే శాశ్వితులు. సమస్తాన్ని ఈశ్వరునిగా చూడాలి. మనం మహాత్ములను ప్రేమించటం పెద్ద విషయం ఏమీ కాదు. మహా పాపిని కూడా మహాత్మునివలె ప్రేమించాలి. ఈశ్వరకృపచే వారి అనుగ్రహశక్తి ఉంటే వానియందు పాపాలను నివారించటానికి ప్రయత్నించాలి. దానికి మార్గం గురుభక్తి. ఈ జగత్తును ఈవిధంగా ప్రేమమయం చేసుకొంటే దివ్యశాంతి మనలో విరాజిల్లుతుంది. గాంధీజీ, మదర్‌థెరిస్సా దీనికి ఉదాహరణలు. ప్రేమతో చిన్న పని చేసినా చాలు. గురునానక్ "భగవంతుని ఆజ్ఞను ఉల్లంఘిస్తే ప్రేమసూత్రం తెగిపోతుంది. వాక్కులో దురుసుతనం ఉంటే ప్రేమ విరిగిపోతుంది. భగవంతుడు పాప వధువును స్వీకరించడు. ప్రేమతో కూడిన భగవత్ భక్తి లేకపోతే మనస్సు నిర్మలంగా ఉండదు. మనం మనలను నిర్మలం చేసుకొని భగవంతుణ్ణి సమీపిస్తే మనకు సత్యం గోచరమౌతుంది" అన్నారు. ఆచారాలు, కర్మకాండలతో, ధర్మగ్రంధాలు చదువుతారు ప్రార్ధనలు చేస్తారు మంచిదే కాని దెబ్బలాడుకోకూడదు. రాళ్ళను రప్పలను పూజించి కొంగ జపాలు చేస్తూ దేహం మీద ధార్మిక చిహ్నాన్ని ధరించి గాయత్రిని జపిస్తారు మంచిదేకాని అసత్యం పలుకకూడదు. మెడలో రుద్రాక్షలు, ముఖం మీద జేగూరు రంగు బొట్టు, వంటి మీదకుట్టులేని బట్ట కట్టుకొంటారు. భగవంతుడు సత్యస్వరూపుడు అని గుర్తించాలి. అది నిజమని నమ్మితే ఈ ఆఢంబరమైన కృత్రిమాలు అంతా అసత్యమని నమ్ముతారు. ముఖ్యంగా సాధకులు దీన్ని గుర్తించాలి. మాయలో పడకూడదు. హృదయం నుంచి వచ్చిన మాటలే హృదయాన్ని చేరుతాయి. పాండిత్యం మాటలు ఆ ప్రాంగణానికే పరిమితమైపోతాయి. నిజంగా భగవంతునికి కావలసినది ఒక్కటే మంచి మనస్సు మిగిలినవి అన్నీ ఊకదంపుడు వాగుడు. బాపూ అహింస అనే సత్యాగ్రహాన్ని ఆయుధంగా తీసుకొని ప్రపంచానికి ఆదర్శమూర్తిగా జీవించారు. ఆయన అంటారు "ఈ రోజు గురించి మనం జాగ్రత్త తీసుకుంటే భగవంతుడు రేపటి గురించి జాగ్రత్త తీసుకుంటాడు. నాకు అహింస, సత్యం పట్టుకొమ్మలు" అని. మనం ఇప్పడే ఇక్కడే ఏ జీవిని శారీరకంగా, మానసికంగా హింసకు గురికాకుండా చూస్తాను అని శపధం చెయ్యాలి. హింసించటం వల్ల మనిషికి భయం కలిగి నిర్వీర్యం అవుతాడు. తనకన్న భిన్నంగా చూడని జ్ఞానికి భయం ఎక్కడ. జంతువును హింసించి దాని మాంసాన్ని ఆహారంగా తీసుకుంటే దాని సంస్కారాలు అబ్బి మనస్సు విషపూరితమౌతుంది. జీవహింస పాపాల్లో కెల్ల పాపం. సాత్విక ఆహారం సాధకుని మనస్సు శుద్ధిచేసి సత్యం వైపుకు వెళ్ళేలా సహకరిస్తుంది.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**